# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# దాసం గోపాలకృష్ణ

## ( విజయచిత్ర – 1968, ఆగస్టు సంచిక నుంచీ)




బాలా ప్రొడక్షన్స్ వారి 'బంగారు సంకెళ్ళు' చిత్రం – కొత్త రచయితను పరిచయం చేస్తున్నది. అతను దాసం గోపాలకృష్ణ. 'బంగారు సంకెళ్ళు' చిత్రం నిజానికి గోపాలకృష్ణకు మొదటి చిత్రమే అయినా – అంతకు పూర్వం అతను భారత్ ఫిల్ము వారి 'భక్త పోతన' లో కూడా సంభాషణలు రాశాడు. అయితే, సహాయ సంభాషణా రచయితగా ఆ చిత్రంలో అతను పని చేశాడు – 'బంగారు సంకెళ్ళు' తానుగా, పూర్తిగా మాటలు రాసిన చిత్రం.

అత్తిలి దగ్గరగా వున్న కోడవల్లి గ్రామం గోపాలకృష్ణ స్వగ్రామం. అత్తిలి, తణుకు, భీమవరం – మొదలైన వూళ్ళలో అతను చదువుకున్నాడు. గోపాలకృష్ణ తండ్రి గారు మంచి పండితులు. ఖగోళ, భూగోళ శాస్త్రాల మీద, తతిమ్మా శాస్త్రాల మీద ఆయనకు మంచి శ్రద్ధ వుండేది.

కోడవల్లి గ్రామం – చెప్పుకోవాలంటే వీధి భాగవతాలకు పుట్టిల్లు లాంటిది. ఆ వూరి వీధి భాగవతులకు మంచి పేరుండేది. వాళ్ళు వీధి నాటకాలు రమ్యంగా ఆడేవాడు. చిన్నతనంలో గోపాలకృష్ణ ఆ నాటకాలను ఆసక్తితో చూసేవాడు; వారివారి పద్ధతులను గమనించేవాడు. నాటకాల మీద శ్రద్ధ అలా వుండగా అతను తెలుగులో బాగా కృషి చెయ్యడం ఆరంభించాడు. ప్రబంధాలు, కావ్యాలు చదివి అర్థం చేసుకున్నాడు; వ్యాకరణం బాగా ఒంట పట్టించుకున్నాడు.

ఇంటర్మీడియెట్ చదువు పూర్తయిన తర్వాత, గోపాలకృష్ణ ఏ వుద్యోగానికి పోవడమూ అన్న ఆలోచనలో పడి, ఏ ఉద్యోగమూ చెయ్యలేదు. పత్రికల్లో వ్యాసాలూ కథలూ రాయడం సాగించాడు. చిన్నతనంలో నాటకాలమీద వున్న ఉత్సాహం వల్ల, తన పాండిత్యంతో – కొన్ని పురాణ నాటకాలు రాశాడు.

అప్పట్లో సాంఘికాలమీద పెద్ద నమ్మకం లేదు. తర్వాత తర్వాత సాంఘిక వాతావరణంతో సాంఘిక నాటకాలు కూడా రాయాలన్న ఉత్సాహం కలిగి – ఆ నాటకాలు రాయడానికి ఉద్యమించాడు.

హైస్కూల్లో చదువుకుంటూ వుండగానే అతనికి నాటక రచన అలవాటయింది. పాటలు కూడా రాయడం సాగించాడు.

స్కూల్లో ప్రదర్శించడానికని, మొదటిసారిగా 'సర్వం జగన్నాథం' అన్న సాంఘిక నాటికను రాశాడు. ఆ నాటికను స్కూల్లో ఆడారు; తర్వాత అక్కడా అక్కడా ఆడారు. పద్యాలూ పాటలతో 'పున్నమిదేవి' అన్న చారిత్రక నాటకాన్నీ, 'నరకాసుర వధ' పురాణ నాటకాన్నీ రాశాడు – గోపాలకృష్ణ అప్పట్లో.

1960 లో తణుకులో ఆంధ్ర నాటక కళా పరిషత్తు జరిగింది. ఆ పోటీలో దాసం గోపాలకృష్ణ రాసిన 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకం ప్రదర్శింపబడింది. నాటక రచనకు ఉత్తమ బహుమతీ, తదితర బహుమతులు కొన్నీ లభించాయి. ఆ నాటకంతో గోపాలకృష్ణ పేరు అందరికీ బాగా తెలిసింది. ఆ నాటకం అతనికి మంచి పేరు తీసుకొచ్చింది.

"దానికి కారణం – ఆ నాటకంలోని కథా వస్తువూ, పాత్రలూ. సజీవమైన పాత్రలూ, వాస్తవికమైన కథా కావడంచేత ఆ నాటకాన్ని అందరూ మెచ్చుకున్నారు" అన్నడు గోపాలకృష్ణ.

కొంతకాలం క్రితం 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకం మద్రాసులో ప్రదర్శింపబడింది. నాటక ప్రదర్శన చూసి, రెండో రోజు కూడా అదే నాటకాన్ని కల్చరల్ క్లబ్ వారు ఆడించారు. ఆ నాటకంలో వాణిశ్రీ నటించింది. ఆ నాటకంతోనే ఆమె, దర్శక నిర్మాతల దృష్టిలో పడి, తారగా మారింది; మంచి రచయితగా గోపాలకృష్ణ పేరు మద్రాసులో బాగా పాకింది.

డా॥రాజారావు గారు 'పుట్టిల్లు' తీస్తున్న సమయంలో గోపాలకృష్ణ మద్రాసు వచ్చాడు. 'పుట్టిల్లు' బృందంలో వున్నవారు కొందరు గోపాలకృష్ణ మిత్రులు. అప్పుడే ఆయనకు దర్శకుడు రామినీడు గారితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం మంచి స్నేహమైంది. గోపాలకృష్ణ నాటకాలు, అతని రచనా రామినీడు గారిని మెప్పించాయి. 'భక్త పోతన' చిత్రం తీస్తున్న సమయంలో గోపాలకృష్ణను రప్పించి, ఆ చిత్రానికి సహాయ సంభాషణా రచయితగా పని చేయించారు. గోపాలకృష్ణకు సినిమాలతో సంబంధం అలా ఏర్పడింది. అప్పుడే స్క్రిప్టు, మంచి చెడ్డలు మొదలైన విషయాలు అనేకం తెలిశాయి.

రామినీడుగారి దర్శకత్వంలో బాలా ప్రొడక్షన్స్ వారు 'బంగారు సంకెళ్ళు' ప్రారంభిస్తూ గోపాలకృష్ణను రచయితగా తీసుకున్నారు. 'బంగారు సంకెళ్ళు' జరుగుతూ వుండగానే, అతనికి మరికొన్ని అవకాశాలు వచ్చాయి.

సుబ్బలక్ష్మి పిక్చర్స్ వారు బి.యస్. నారాయణ దర్శకత్వంలో ఆరంభిస్తున్న సాంఘిక చిత్రానికీ, గిడుతూరి సూర్యం దర్శకత్వంలో సప్తగిరి ఆర్ట్స్ వారు తీస్తున్న సాంఘికానికీ, పి.సుబ్రమణ్యం దర్శకత్వంలో కళా చిత్రవారు నిర్మించనున్న సాంఘికానికీ గోపాలకృష్ణ ఇవాళ, రచయితగా పని చేస్తున్నారు.

"చిత్ర రచన, పద్ధతీ అంతా నాకు రామినీడుగారే నేర్పారు. ఆయన ప్రోత్సాహంతోనే తెర రచయితను కాగలిగాను. ఆయన నాకు గురుతుల్యులు" అన్నారు గోపాలకృష్ణ.

COMMENTS